క్లుప్తంగా

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మానవత, తెనాలి శాఖ ఆదివారం మరో సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. సమీపంలోని బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ట్రై సైకిళ్లను పంపిణీ చేసింది. వేమూరు మండల గ్రామం పెరవలి పాలేనికి చెందిన పెరవలి వినయ్‌కుమార్, వేమూరు నివాసి పిల్లి శరత్‌కు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి చేయూతనిచ్చేందుకు మానవత సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందని చెప్పారు. ఇందు కోసం సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కమిటీ పని చేస్తున్నట్టు చెప్పారు. సహకరిస్తున్న సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో మానవత తెనాలి ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, సంస్థ మహిళా విభాగ అధ్యక్షురాలు కె. కల్యాణి, కార్యదర్శి పి వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, కోశాధికారి ఎస్.వి. శర్మ, సభ్యులు చిట్టినేని సాంబశివరావు, పరుచూరి మల్లికార్జునరావు, మల్లాది అర్జున్, కావూరి నాగేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్, పి.శివరాజ కుమారి, కె.రవీంద్రనాథ్, కె.మదన్‌మోహన్‌రావు, కార్తిక్ పాల్గొన్నారు. మానవత టీమ్‌కు లబ్ధిదారులు వినయ్‌కుమార్, శరత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కేంద్రంలో చంద్రబాబుది ప్రేక్షక పాత్ర

మంగళగిరి టౌన్: కేంద్రంలో చంద్రబాబు పాత్ర కేవలం ప్రేక్షక పాత్రే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారే తప్పా.. ఎటువంటి అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోదీ, అమిత్‌షా జోడీలు దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తూ కార్పొరేట్‌లకు దాసోహం అవుతూ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నాయకులు బాపనపల్లి వెంకటేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంలో తాచుపాము

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కత్తుల పేటలో ఓ ద్విచక్రవాహనంలో తాచుపాము దూరి బుసలు కొట్టింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఓ యువకుడు ద్విచక్రవాహనం తీసుకువచ్చి ఇంటిముందు పార్క్ చేసి భోజనం చేసిన అనంతరం బయటకు వచ్చి చూడగా తాచుపాము బుసకొడుతున్నట్లు శబ్దం వచ్చింది. బండిని క్షుణ్ణంగా పరిశీలించగా పాము ఉందని గమనించి చుట్టుపక్కల వారిని పిలిచాడు. బండిలో ఉన్న పామును బయటకు తీసి కొట్టి చంపారు.

రైతులకు క'న్నీ'టి' కష్టాలు

- సాగునీటి కోసం అవస్థలు
- మాగాణి భూముల్లో వెద సాగు



తూములూరులో ఆయిల్ ఇంజనుతో నీరు పెడుతున్న రైతు

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని తెనాలి ప్రాంతంలోని మాగాణి భూముల్లో తొలిగా వరి సాగుకు శ్రీకారం చుట్టే కొల్లిపర మండల రైతులకు ఇప్పుడు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. పంట కాల్వలకు ఇప్పట్లో నీరు వదిలే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆయిల్ ఇంజన్లు, మోటార్లపై ఆధారపడి పొలాలకు నీరు అందిస్తున్నారు. ఆరంభంలో మురిపించిన వర్షపు చినుకు ఇప్పుడు ముఖం చాటేసింది. వాతావరణంలో తేమ శాతం తగ్గిపోయి, వేడి గాలులు వీస్తుండటంతో పంట చేను తడిచేందుకు అధిక సమయం తీసుకుంటోంది. ఫలితంగా ఖర్చులూ పెరుగుతున్నాయి.

నాట్లుకు స్వస్తి

కృష్ణా డెల్టాలో ఏటా జూన్ రెండో వారంలో ఆరంభించే ఖరీఫ్ సీజను సమయం మారిపోయింది. ఎగువ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆధారంగా పంట కాల్వలకు నీటి విడుదల క్రమంగా జులైకు, ఆ తర్వాత ఆగస్టు నెలకు మారింది. దీంతో వరి నారు పెంచి నాట్లు వేసే విధానానికి రైతులు అధిక శాతం స్వస్తి పలికారు. నారుతో పనిలేకుండా వరి విత్తనాలు వెదజల్లే పద్ధతిని ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఆశించిన ఫలితాల నివ్వడంతో ఇప్పుడు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. పశ్చిమ డెల్టాలో ఎగువ భూములున్న తెనాలి ప్రాంతంలో అన్నదాతలు వెద పద్ధతిలోనే వరిసాగు చేస్తున్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

ఏటా లాగే కొల్లిపర మండలంలో ముందస్తుగా రైతులు వెద పద్ధతిలో వరి సాగుకు పూనుకున్నారు. గత రెండు వారాలుగా మాగాణి భూమిలో విత్తనాలను ట్రాక్టర్లతో వెద్ద పద్ధతిలో చల్లుతున్నారు. ఆరంభంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని చిరుజల్లులు పడటంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యారు. వర్షాలు ఆరంభమయినట్టేనని అంతా భావించారు. కొద్దిపాటి జల్లుల తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. మరోవైపు వేడిగాలులు వీస్తున్నాయి. వెదపెట్టిన రైతులు వారం రోజుల నుంచి ఎదురుచూస్తున్నా వర్షం జాడ లేకపోవటంతో రైతుల సంతోషం ఆవిరైంది. మరోవైపు ప్రభుత్వం కూడా పంట కాల్వలకు సాగునీటి విడుదలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను చూస్తుంటే ఇప్పట్లో నీరు విడుదల చేసే అవకాశం కనిపించటం లేదు.

బోర్లు ద్వారా నీటి తడి

చేసేదిలేక రైతులు వెదజల్లిన విత్తనాలకు బోర్లు ద్వారా నీటి తడి అందిస్తున్నారు. కరెంటు మోటార్లు అందుబాటులో ఉన్నవారు భూగర్భ జలాలను తోడుతూ పంట చేనుకు నీరిస్తున్నారు. మరికొందరు ఆయిల్ ఇంజన్లతో నీరు అందిస్తున్నారు. వేడిగాలుల కారణంగా చేలు తడిచేందుకు మోటార్లు/ఇంజన్లు ఎక్కువసేపు ఆడాల్సి వస్తోంది. దూరం నుంచి నీరు తీసుకుంటున్న రైతులు అందుకు ట్యూబులనూ అద్దెకు తీసుకుంటున్నారు. ఫలితంగా ఖర్చులు పెరుగుతున్నాయి. ఎకరా పొలం దుక్కి దున్నటానికి రూ.1800 ఖర్చయితే, ధాన్యం 30 కిలోల బస్తా రూ.1350, వెద పెట్టటానికి రూ.1500, నీటి తడికి రూ.1000, మందు ఖర్చులతో కలిపి ఇప్పటివరకు రైతులు రూ.6,650 వ్యయం చేశారు. పంట కాల్వలకు నీరు విడుదల చేసేలోగా వర్షాలు కురిస్తే ఫర్వాలేదు. జాప్యమైతే మరోసారి నీటితడి ఇవ్వాల్సి వస్తుంది. అదనపు ఖర్చు తప్పదని రైతులు చెబుతున్నారు.

భక్తిప్రవత్తులతో తొలి ఏకాదశి పూజలు



జనార్దనస్వామి దేవాలయంలో స్వామి



వైకుంఠపురం ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

తెనాలి: తొలి ఏకాదశిని పట్టణ ప్రజలు భక్తి ప్రవత్తులతో జరుపుకున్నారు. వైకుంఠపురం దేవస్థానంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను బుధవారం పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయం కళకళలాడింది. కొందరు భక్తులు పొంగలి నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు.

- అమరావతి కాలనీలోని శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి శ్రీ గోదా పద్మావతి అమ్మవారిని, శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు.
- నాజరుపేటలోని శ్రీ పాండురంగస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు.

ఆలయాల్లో భక్తుల సందడి

- నాజరుపేటలోని అనుగోలువారి వీధిలో గల శ్రీపాండురంగస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామార్చనలు చేశారు. భక్తులు ఉదయం నుంచి ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. తొలి ఏకాదశి ప్రాధాన్యత కలిగినది కావడంతో గుడికి వెళ్లలేని వారు తెల్లవారుతూనే నిద్ర లేచి, తలారా స్నానం చేశారు. ఇళ్లలోనే పూజలు చేసుకున్నారు. ఉపవాస దీక్షలను చేశారు.

కొల్లిపరలో..

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విష్ణు సహస్ర నామ పారాయణతో ఆలయాలు మార్మోగాయి. ఆదివారం తెల్లవారుజామున నుంచే మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, దావులూరుతో పాటు పలు గ్రామాలల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకార సేవలు జరిగాయి.కొల్లిపరలోని శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి దేవాలయంలో స్వామికి ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలతో స్వామి దర్శనమిచ్చారు. వేద పండితులు పూజలను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు.

పసుపు విత్తు సమయంలో జాగ్రత్తలు అవసరం

కొల్లిపర: పసుపు విత్తు సమయంలో రైతులంతా జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలో నాగలి ద్వారా విత్తనం వేస్తున్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. విత్తనం సుమారు 30–40 గ్రాముల బరువు కలిగి, ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్లు పచ్చి కొమ్ములు అవసరమని చెప్పారు. పొలంలో విత్తు సమయంలో లోతు 8 నుంచి 12సెం.మీ ఉండే విధంగా నాగలితో దున్నాలని ఆయన సూచించారు. అప్పుడే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

విత్తన శుద్ధి

- పసుపు కొమ్ములు విత్తేటప్పుడు వారం రోజులు ముందుగానే పరిశీలించుకోవాలి. కుళ్లిన వాటిని తీసేయాలి.
- కొమ్ములను తప్పనిసరిగా రిడోమిల్ (మేటలాక్సిల్4% + మాంకోజెబ్64%) మూడు గ్రాములు లీటరు నీటికి లేదా ట్రైకోడర్మా ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి శుద్ధి చేయాలి.
- నిల్వ ఉంచిన కొమ్ములకు పొలుసు పురుగులు ఆశిస్తే మోనోక్రోటోఫాస్ రెండు మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి శుద్ధి చేసుకోవాలి.
- దీనివల్ల విత్తనాల ద్వారా సంక్రమించే దుంప కుళ్లు, వేరు కుళ్లు , తాటాకు, ఆకు మచ్చ తెగుళ్లను ముందుగానే అరికట్టవచ్చు. విత్తన శుద్ధి చేసిన తర్వాతే పొలంలో నాటాలి.

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'పై సమావేశం

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' అంశంపై నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయం పక్కన గల ఎం.కన్వెన్షను హాలులో మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటయే సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు సారథ్యంలో అతి ముఖ్యమైన అంశాలపై నిర్ణయం జరుగుతుందని పేర్కొంది. సమావేశానికి పార్టీ జిల్లాస్థాయి నాయకులంతా హాజరవుతారని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరింది.

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల పాలిట శాపం



పడమర కాల్వ వెంట వ్యర్థాల గుట్టలు

తెనాలి అర్బన్: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. కాల్వల్లోని వ్యర్థాలను బయటకు తీసి రోడ్డుపై పోసి వదిలేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పట్టణంలోని పడమర కాల్వ పూడికతీత పనులను నెల కిందట ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. కాల్వల్లో వచ్చిన వ్యర్థాలను పక్కనే ఉన్న ప్రధాన రహదారిపై పోశారు. యడ్ల లింగయ్య పెట్రోలు బంక్ నుంచి డీఎస్పీ కార్యాలయం వెనుక రోడ్డు వరకు ఇదే పరిస్థితి ఉంది. దీనివల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి వ్యర్థాల గుట్టలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యతో జీవితంలో ఉన్నత స్థితి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు

తెనాలి అర్బన్: విద్యతో జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. జాబిల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో తెనాలి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివి 580 మార్కులకు పైగా సాధించిన ఏడుగురు విద్యార్థులకు రూ.2000 చొప్పున నగదు బహుమతులు, మెమెంటో, సర్టిఫికెట్లను ఆదివారం తెనాలిలో అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షుడు కొసరాజు వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించడమే తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేస్తున్నామని చెప్పారు. నేలపాడులో ప్రభుత్వ సహకారంతో ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎ.ఆంజనేయులు, శైలజ, పూర్ణచంద్రరావు, ప్రసాద్, పి.విజయలక్ష్మి, శ్రీదేవి, బి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



కమిటీ నేతలతో వెంకటేశ్వరరావు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ సమావేశం జగడిగుంటపాలెంలోని ప్రగడ కోటయ్య నగర్ పద్మశాలి కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించారు. సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో సంఘం జగ్గడిగుంటపాలెం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగర సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా చింతిక్రింది కోటిస్వామి, కార్యదర్శిగా కటకం యుగంధర్, సహాయ కార్యదర్శులుగా దామర్ల సుబ్బారావు, గంగనపల్లి సువర్ణరాజు, పానుగంటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా కొడాలి వంశీ, జొన్నాదుల నాగేశ్వరరావు, డోగుపర్తి భద్రయ్య, దేశబోయిన శ్రీనివాసరావు, కాగితాల వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీనాగమణి ఎన్నికయ్యారు. వీరందరికీ వెంకటేశ్వరరావు నియామక పత్రాలు అందజేశారు. బీసీల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జొన్నాదుల వెంకటసాయి మణికంఠ, గుర్రం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి అత్యంత ప్రాణాంతకం



కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్ నాగిరెడ్డి

తెనాలి టౌన్: పెంపుడు జంతువుల్లో వచ్చే రేబిస్ వ్యాధి అత్యంత ప్రాణాంతకమైనదని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.నాగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని ఏరియా పశు వైద్యశాలలో జూనోసిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుక్కలు, పిల్లలు వంటి పెంపుడు జంతువులను పోషించే యాజమానులకు రేబీస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి ప్రాణాంతకమైనదని, టీకా నివారణోపాయమని వెల్లడించారు. ఒక చిన్న టీకా జంతువులు ప్రాణాన్ని రక్షించగలుగుతుందని చెప్పారు. పెంపుడు జంతువుల యజమానులు సకాలంలో టీకాలు వేయించాలని ఆయన సూచించారు. అనంతరం పిల్లులు, కుక్కలకు టీకాలు వేశారు. పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ వై.పద్మావతి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ జి.నరేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న తోటకూర కోటేశ్వరరావు తదితరులు

తెనాలి టౌన్: దేశం కోసం ప్రాణాలను బలిదానం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని, ప్రజలకు ఆయన సేవలు చిరస్మరణీయమని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగులో ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి కోటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కె.రామస్వామి, షేక్ షబ్బీర్, బి.శ్రీను, ఎస్.నారాయణ, బి.వెంకటేశ్వర్లు, కె.బుల్లయ్య పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతో మానవాళికి మేలు



వాకింగ్ ట్రాక్ చుట్టూ మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

కొల్లిపర: మొక్కల సంరక్షణ ద్వారా మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని శ్రీ కళా నిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కొల్లిపరలోని అవుతురామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలోని వాకింగ్ ట్రాక్ చుట్టూ విద్యార్థినులు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన్ విశ్వవిద్యాలయ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సొంత ఖర్చులతో క్రోటన్ మొక్కలు కొని, వాకింగ్ ట్రాక్ చుట్టూ నాటడం మంచి పరిణామని కొనియాడారు. రానున్న రోజులల్లో మరెన్నో మంచి పనులు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో రోగులు పరిస్థితి దయనీయం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్)లో రోగుల పరిస్థితి ఘోరంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ లేకపోతే వైద్య సేవలు, మందులు అందజేయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నటరాజన్ ఏఆర్ సర్క్యులర్ జారీ చేయడంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆసుపత్రిలో వివరణ కోరగా ప్రస్తుతం బీపీఎల్ కార్డు ఉన్న వారందరికీ ఉచితంగా చికిత్స, మందులు అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎలాంటి నిబంధనలు అమలులో ఉన్నాయో.. మంగళగిరి ఎయిమ్స్‌లోనూ అవే నిబంధనలు పాటిస్తున్నట్లు తెలిపారు. రోగులకు ఇబ్బంది లేకుండా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అత్యధికంగా ఖర్చు అయ్యే చికిత్సతో పాటు మందులు కొనుగోలు చేసుకోవాలని బీపీఎల్ లేని వారికి సూచిస్తున్నట్లు చెప్పారు.

జగ్జీవన్‌రామ్, ఏకలవ్యులకు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్, ఏకలవ్యులకు నివాళి అర్పిస్తున్న నాయకులు



రైల్వేస్టేషన్ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బీజేఆర్ కమిటీ సభ్యులు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జాస్మిన్, లక్ష్మయ్య తదితరులు

తెనాలి: తొలి ఏకాదశి పర్వదినాన ఇద్దరు మహనీయులను స్మరించుకుని నివాళి అర్పించడం సంతోషంగా ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, ఆదివాసీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు అన్నారు. స్థానిక రైల్వేస్టేషను సెంటరులోని ఐక్యవేదిక కార్యాలయంలో ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్, ఏకలవ్య జయంతిని ఆదివారం నిర్వహించారు. చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఏకలవ్య జీవిత చరిత్రను శంకరరావు తెలియజేశారు. ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నలగండ్ల రవిచంద్ర, మహేష్, ఆదివాసీ ఎరుకల సేవా సంఘ సభ్యుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ గరిక శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఇట్టా ధనకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ పవన్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కట్టా రామాంజనేయులు, పేరం సాంబశివరావు, జిల్లా కోశాధికారి పాలపర్తి నాగరాజు, మేడసరి వెంకట్రామయ్య, కుంచా శ్రీనివాస్, కట్టా వెంకటస్వామి, పాలపర్తి ప్రసాద్, అలపర్తి శివతేజ, దేవరకొండ గోపి, సాలా వంశీ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

తెనాలి రూరల్: మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని బాబూ జగ్జీవన్‌రామ్ కమిటీ (బీజేఆర్)అధ్యక్షుడు మేకల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని విగ్రహానికి బీజేఆర్ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కార్మిక, వ్యవసాయ తదితర శాఖల కేంద్రమంత్రిగా జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ముఖ్యంగా 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం సందర్భంలో రక్షణ శాఖ మంత్రిగా ఉన్న ఆయన అవలంబించిన విధానాలు గెలుపునకు దోహదపడ్డాయని గుర్తు చేశారు. అనంతరం ఐతానగర్ లింగారావు సెంటరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో నలుకుర్తి సద్గుణరావు, సిద్దెల కమలాకరరావు, తెనాలి రవికుమార్, యడ్లపల్లి అనిల్, అత్తోట శ్యామ్, మేకల కృష్ణకాంత్, ఉయ్యూరి అవినాష్, గాజులవర్తి రాజేష్, పినపాటి రాజేష్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో పాలకులు పనిచేయాలి

తెనాలి అర్బన్: జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో పాలకులు పనిచేయాలని జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు కలివరపు దేవానంద్ పేర్కొన్నారు. భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని గంగానమ్మపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

- జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పులివర్తి లక్ష్మయ్య, జాస్మిన్‌లు మాట్లాడుతూ భారత ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు మరవరానివన్నారు. దళిత కుటుంబంలో జన్మించిన ఆయన అంచెలంచెలుగా ఉన్నత స్థితి చేరుకోగలిగారని గుర్తు చేశారు. ఆనాటి పాలకులు ప్రధాని కాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అందరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏపీపీ ఇందుపల్లి రాజారాం, కొండమూది రమేష్, పులివర్తి ఎఫ్రాయిన్ ఎల్ రాజు, కళ్యాణరావు, కొండమూది సుధీర్ పాల్గొన్నారు.

ఉత్తమ పార్లమెంటేరియన్

తెనాలి టౌన్: జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్వవిద్యాలయం జగ్జీవన్‌రామ్ చైర్ అధ్యక్షులు డాక్టర్ పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ పేర్కొన్నారు. ఆదివారం కొలకలూరులో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదిజాంబవ దళిత ఎంప్లాయీస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రివర్గంలో వివిధ పదవులు అలంకరించి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారని, అనేక సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో యడ్లపల్లి రవికిరణ్, ఎస్.శరత్ వెంకయ్య, ఎం.గురుదేవ్, కె.పాపారావు, ఎస్.వినయ్ కుమార్, కె.నాగేశ్వరరావు, పి.అనిల్‌కుమార్, ఎస్.జోసఫ్, ఉన్నం ధర్మారావు, సుద్దపల్లి కనకరాజు, పి.రాజా పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవానంద్ తదితరులు



నివాళులర్పిస్తున్న ఆదిజాంబవ దళిత ఎంప్లాయీస్ సేవా సమితి సభ్యులు